epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 255 ఎడిటర్ : విక్రం కుమార్ శనివారం 24, మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

# ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

- రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని

దిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు గతంలో ఎప్పుడూ లేనంతగా పురోగమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వైవిధ్యమే ఈశాన్య ప్రాంతానికి అతిపెద్ద బలమన్నారు. దిల్లీలోని భారత మండపంలో రెండు రోజులపాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును శుక్రవారం మోదీ ప్రారంభించారు. సదస్సుకు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలు తదితరులు తరలివచ్చారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, అనిల్ అగర్వాల్ వంటి పారిశ్రామికరంగ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు. భారతదేశ సెమీకండక్టర్ వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర పెరుగుతోందన్నారు. గతంలో ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు మారుపేరుగా ఉండేదని, దీనివల్ల స్థానిక యువత చాలా అవకాశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఈశాన్య యువత హింసను విడిచిపెట్టినట్లు ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా మార్చడం లక్ష్యంగా

తరువాయి 2లో



## 227 మంది ప్రాణాలతో పాక్ చెలగాటం

- ప్రమాదపుటంచుల్లో ఉన్న భారత విమానంపై ఆ దేశం నిర్దయ
- గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతించని వైనం

2లో



## తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తా




- మరో 50 సార్లయినా ప్రధానిని కలుస్తా
- త్వరలో నిమ్జ్‌లో హ్యుందాయ్ కార్ల పరిశ్రమ
- జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## తెలంగాణ.. మా హృదయాన

- రాష్ట్రంపై ప్రపంచ సుందరీమణుల ప్రశంసలు
- మిస్ వరల్డ్ హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్ విజేతలు తుర్కియే, వేల్స్, జాంబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో భామలు
- తెలంగాణ, సామాజిక అంశాలపై ప్రశ్నలడిగిన న్యాయనిర్ణేతలు

**మే 23, సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రపంచ సుందరి పోటీల్లో కీలకమైన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో నలుగురు విజేతలుగా నిలిచారు. ఆసియా ఓషియానా ఖండం నుంచి

తరువాయి 2లో





## అమరావతిని రాజధానిగా నోటిఫై చేయండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి
- వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే చేయాలని కోరినట్లు వెల్లడి
- విశాఖకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటన
- అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?
- రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?
- వైకాపా అధినేత వైఖరిపై చంద్రబాబు అసహనం

**మే 23, సమయం న్యూస్, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వశాఖ కార్యాలయంలో అమిత్‌షా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని శాంతిభద్రతలు, కొత్త నేర న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు.

తరువాయి 2లో

## భారాసలో కోవర్టులున్నారు



2లో

- వారిని తప్పించి.. ముందుకెళ్తే పార్టీదే భవిష్యత్
- కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయి
- గతంలో కూడా అనేకసార్లు లేఖలు రాశా
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## 15 చ.కి.మీ... 15 వేల మంది బలగాలు

- అష్టదిగ్బంధనంలో మావోయిస్టు అగ్రనేతలు
- చివరి దశకు ఆపరేషన్ కగార్
- లొంగిపోయేందుకు కొందరి ప్రయత్నం!

**మే 23, సమయం న్యూస్, హైదరాబాద్:** పదిహేను చదరపు కిలోమీటర్ల పరిధిలో... పదిహేను వేల మంది భద్రతా బలగాలు... ఇదీ ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని

తరువాయి 2లో



# తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తా

జహీరాబాద్: రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిధుల కోసం అవసరమైతే ప్రధాని మోదీని మరో 50 సార్లు కలిసేందుకు సిద్ధమన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి రూ.494.67 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం జహీరాబాద్ పట్టణం పస్తాపూర్‌లో జరిగిన ప్రజాపాలన.. ప్రగతి బాట బహిరంగ సభలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని.. ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధే తనకు ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయన్నారు. కేంద్రంపై అలిగితే రాష్ట్రాలకే నష్టమని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతంతో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఉన్న అనుబంధం విడదీయలేనిదని సీఎం రేవంత్ అన్నారు. తుది శ్వాస వరకు ఆమె మెదక్ ఎంపీగా, ప్రధానిగా దేశానికి సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. గత



ప్రభుత్వ హయాంలో నిమ్జ్ నిర్లక్ష్యానికి గురైందని, అభివృద్ధి కుంటుపడిందని ధ్వజమెత్తారు. ''రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేసి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని భారీగా పెంచాం. భూములు ఇస్తున్న 5,612 మంది రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. త్వరలోనే బాధిత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ఇళ్ల మంజూరు పత్రాలు అందించే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా. త్వరలోనే నిమ్జ్‌కు హ్యుందాయ్ కార్ల పరిశ్రమ రాబోతోంది. ఇది చెప్పడానికి సంతోషంగా ఉంది.

*** అదానీ, అంబానీతో ఆడబిడ్డల పోటీ**

రాష్ట్ర ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఐదేళ్లలో కోటి మందిని కోటీశ్వరులను చేస్తానని మాట ఇస్తున్నా. అమ్మగారి ఇంటికి వెళ్లాలన్నా.. అమ్మోరును దర్శించుకోవాలన్నా గతంలో మహిళలు బస్సు ఛార్జీల కోసం ఇంటాయనను అడగాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. ఇందుకోసం 18 నెలల్లో రూ.5,500 కోట్లు విడుదల చేశాం. స్వయం సహాయక సంఘాలకు గతేడాది రూ.20 వేల కోట్లు, ఈ ఏడాది రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. 600 బస్సులను మహిళలు ఆర్టీసీకి అద్దెకు ఇస్తున్నారు. పెట్రోల్ బంకులు, ఇందిరా శక్తి క్యాంటీన్లు నిర్వహిస్తూ.. ఉపాధి పొందుతున్నారు. గతంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని ప్రకటించిన కేసీఆర్.. తన ఇంట్లో మాత్రమే ఉద్యోగాలు ఇచ్చుకొని నిరుద్యోగులను మోసం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. మరో లక్ష ప్రైవేటు కొలువులు వచ్చాయి. నేను గెలిచినా.. ఓడినా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నా. ముఖ్యమంత్రి అయ్యాక.. ఏనాడూ అహంభావం ప్రదర్శించలేదు. చిన్న.. పెద్ద తేడా లేకుండా ఎవరొచ్చినా కలుస్తున్నా. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోయేది లేదు'' అని సీఎం రేవంత్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# తెలంగాణ.. మా హృదయాన...

(మొదటిపేజీ తరువాయి)

తుర్కియే సుందరి ఇదిల్ బిల్గెన్, యూరప్ నుంచి వేల్స్ భామ మిల్లి మా ఆడమ్స్, ఆఫ్రికా నుంచి జాంబియా సుందరి ఫెయిత్ బ్వాల్యా, అమెరికా కరేబియన్ నుంచి మిస్ ట్రినిడాడ్ అండ్ టొబాగో అన్నాలైసే నాన్‌టన్ న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతలయ్యారు. శుక్రవారం హైదరాబాద్ ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో ఒక్కో ఖండం నుంచి ఐదుగురు చొప్పున మొత్తం 20 మంది పోటీపడ్డారు. వీరిలోంచి తదుపరి రౌండ్‌కు ప్రతి ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేసి.. వారి వాగ్ధాటి, మేధస్సు, సామాజిక దృక్కోణం ఆధారంగా ఒక్కో ఖండం తరఫున ఒక్కర్ని విజేతగా ప్రకటించారు. వీరు ఆయా ఖండాల తరఫున టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకున్నారు.

*** మహిళా భద్రతపై అభినందనలు**

హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో వివిధ ఖండాల నుంచి వచ్చిన అందాల భామలు రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. తెలంగాణలో మహిళల భద్రత, సాధికారతపై ప్రపంచానికి మీరు ఏం సందేశం పంపిస్తారు? అన్న ప్రశ్నకు బ్రెజిల్, సురినామ్, కేమెన్ ఐలాండ్స్, గయానా, ట్రినిడాడ్ అండ్ టొబాగో భామలు ఆసక్తికర సమాధానాలిచ్చారు. ఇక్కడ మహిళల భద్రతను హక్కుగా గుర్తించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రిపూట స్వేచ్ఛగా తిరగడం ఆశ్చర్యం కలిగించిందని.. ఇది సురక్షిత నగరానికి ప్రతీక అని చెప్పారు. 'తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?' అన్న ప్రశ్నకు సాంకేతికత, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా మహిళల హక్కులు, విద్య, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చే రాష్ట్రంగా పోటీదారులు అభివర్ణించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు స్ఫూర్తిదాయకంగా అనిపించాయని, ఇక్కడి ప్రజల ఆదరణ, ఆతిథ్యం నచ్చిందని 'బ్యూటీ విత్ ఏ పర్పస్' భావన ఇక్కడి జీవనశైలిలో కన్పించిందని చెప్పారు. 'నా దేశానికి ల్యాండ్ ఆఫ్ సన్‌షైన్ అనే పేరు ఉంది. ఆ పేరు తెలంగాణకు చక్కగా సరిపోతుంది' అని ట్రినిడాడ్ సుందరి అన్నారు.

*** వ్యక్తిత్వం కోల్పోకూడదు..**

సవాళ్లు మీ ఎదుగుదలకు అవకాశాలుగా ఎలా మారాయన్న ప్రశ్నకు 'ప్రపంచం మారవచ్చు కానీ మీరు మారాల్సిన అవసరం లేదు. ప్రపంచం స్వీకరించకపోయినా నిజమైన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు'అని మిస్ వరల్డ్ జాంబియా సమాధానమిచ్చారు. యువత జీవితాలను మెరుగుపర్చడానికి మీరు ఒక మార్పు అమలు చేయగల్గితే అది ఏంటి? అనగా విద్య అత్యంత శక్తిమంతమైన సాధనం అని మిస్ వరల్డ్ వేల్స్ అన్నారు. 'బ్యూటీ విత్ ఏ పర్పస్' ప్రాజెక్ట్‌తో పనిచేయడం మీ దృక్పథాన్ని ఎలా మార్చిందని అడగ్గా క్యాన్సర్‌తో తన తల్లిని కోల్పోయిన ఆంకాలజిస్టు మిస్ వరల్డ్ తుర్కియే.. తన దేశంలో క్యాన్సర్ అవగాహనకు మద్దతు ఇస్తున్నానని చెప్పారు. వాతావరణ మార్పుపై అభిప్రాయం అడగ్గా 'నేను ప్రకృతితో నిండిన భూమి నుంచి వచ్చాను. ప్రేమిస్తూ కాపాడుకుంటాను. పర్యావరణంతో తిరిగి అనుసంధానం కావడానికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. చిన్న అడుగులు సైతం స్థిరమైన భవిష్యత్తును నిర్మిస్తాయి' అని మిస్ వరల్డ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో సమాధానమిచ్చారు.

*** నేడు టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫైనల్..**

అందాల పోటీల్లో మరో కీలకమైన పోటీ శనివారం జరగనుంది. మిస్ వరల్డ్ టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫైనల్‌ను హైటెక్స్‌లో నిర్వహించనున్నారు.

# భారాసలో కోవర్టులున్నారు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్, శంషాబాద్:: భారాసలో ఉన్న చిన్న చిన్న లోపాలపై చర్చించుకొని, సవరించుకోవడంతో పాటు కోవర్టులను పక్కకు తప్పించి ముందుకెళ్తే భవిష్యత్తు పార్టీదేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ''కేసీఆర్ దేవుడు.. కానీ కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయి. వారి వల్ల నష్టం జరుగుతోంది'' అని వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రజతోత్సవ సభ అనంతరం భారాస అధినేత కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ గురువారం వెలుగులోకి వచ్చి చర్చనీయాంశమైన నేపథ్యంలో.. కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''నా కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి వెళ్లిన తర్వాత లేఖ లీక్ అయి హంగామా జరిగినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం నేను కేసీఆర్‌కు లేఖ రాశా. గతంలో కూడా లేఖల ద్వారా కేసీఆర్‌కు అనేకసార్లు అభిప్రాయాలు చెప్పా. నాపై కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని ఇటీవలే చెప్పా. ఇప్పుడు లేఖ బహిర్గతం అవ్వడంతో.. ఏం జరుగుతున్నదోనని పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్న వారు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో చెప్పా. ఇందులో నాకు వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. వ్యక్తిగతంగా నాకు ఎవరిపైనా ద్వేషం లేదు.

*** లేఖ బహిర్గతం వెనుక ఎవరున్నారో..**

మా పార్టీ అధినేతకు రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే.. పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏమిటి? దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. నేను కేసీఆర్‌కు లేఖ ద్వారా వ్యక్తపర్చిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదు. అది బహిర్గతం కావడం బాధాకరం. లేఖ బయటకు రావడంతో భాజపా, కాంగ్రెస్ పార్టీలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు సంబరపడుతున్నాయి. భారాస ఆగమైనట్లు ఆ పార్టీల నాయకులు మాట్లాడుతున్నారు. మా నాయకుడు కేసీఆరే. ఆయన నాయకత్వంలో తెలంగాణ బాగుపడుతుంది. పార్టీ కూడా ముందుకెళ్తుంది. కాంగ్రెస్, భాజపాలు విఫలమయ్యాయి. వాటికి కేసీఆర్ నాయకత్వమే ప్రత్యామ్నాయం'' అని కవిత పేర్కొన్నారు. కవితకు స్వాగతం పలికేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చినా ఎవరూ గులాబీ కండువాలు వేసుకోలేదు. ''కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి.. సీఎం.. సీఎం..'' అని నినాదాలు చేశారు. అభిమానులకు అభివాదం చేసి కవిత వెళ్లిపోయారు.

# 15 చ.కి.మీ... 15 వేల మంది బలగాలు

(మొదటిపేజీ తరువాయి)

దండకారణ్యంలో నెలకొన్న పరిస్థితి. మావోయిస్టు అగ్రనేతలంతా ఈ కొద్ది ప్రాంతంలోనే దాగి ఉన్నారనే సమాచారంతో చుట్టుముట్టిన భద్రతా బలగాలు రోజురోజుకూ చొచ్చుకెళుతున్నాయి. లొంగిపోవడం మినహా మరో మార్గం లేకపోవడంతో కొందరు అగ్రనేతల తరఫున ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికల్లా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఉనికి లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. మొదట దాదాపు 45 వేల మంది భద్రతా బలగాలు దండకారణ్యం నలువైపుల నుంచి లోనికి చొచ్చుకుని వెళుతూ ఎక్కడికక్కడ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకున్నాయి. వీటి చుట్టుపక్కల ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో పదుల సంఖ్యలో మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందగా... అంతకు రెట్టింపు సంఖ్యలో లొంగిపోయారు. ఇటీవల పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల కారణంగా కొంతమేరకు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని వెనక్కి పంపారు. అయితే, తమ వ్యూహాన్ని మాత్రం కొనసాగించారు. దాని ఫలితంగా... పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్... ఎదురుకాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఇప్పుడిక కేవలం 15 చదరపు కిలోమీటర్లు తప్ప మిగతా ప్రాంతమంతా భద్రతా బలగాల చేతిలోకి వచ్చింది. నారాయణపుర్, బీజాపుర్, దంతెవాడల మధ్య విస్తరించిన ఈ దట్టమైన అడవిలోనే మావోయిస్టుల మిగిలిన అగ్రనేతలంతా దాగి ఉన్నారని అధికారులు బలంగా నమ్ముతున్నారు. తమ వ్యూహాన్ని కొనసాగిస్తున్న 15 వేల మంది భద్రతా బలగాలు నలువైపుల నుంచి కమ్ముకొస్తుండటంతో పార్టీ అగ్రనేతల పరిస్థితి ఏమవుతుందన్నది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. మావోయిస్టులు ప్రతిపాదించిన శాంతిచర్చలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తిరస్కరించింది. వారు స్వచ్ఛందంగా కాల్పుల విరమణ ప్రకటించినా పట్టించుకోలేదు. మావోయిస్టులను పూర్తిస్థాయిలో రూపుమాపాలన్న లక్ష్యంతో చొచ్చుకెళుతున్న కేంద్ర బలగాలకు మిగిలిన ఈ 15 చదరపు కిలోమీటర్లను స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ఎక్కువ రోజులు పట్టకపోవచ్చని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

**వారి నుంచి ప్రతిఘటన కష్టమే!**

ఇప్పటికే పూర్తిస్థాయిలో బలహీనపడిన మావోయిస్టులు తమను చుట్టుముట్టిన 15 వేల మంది బలగాలను ఢీకొట్టే పరిస్థితి లేదని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. లొంగిపోవడం మినహా వారికి మరో మార్గమే లేదని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణాలు నిలుపుకోవాలంటే లొంగిపోవడం ఒక్కటే పార్టీ నేతలకు మిగిలిన ప్రత్యామ్నాయం. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న అగ్రనేతలు ఈ దశలో లొంగిపోతారా... అన్నది అనుమానమే. వీరిలో ఒకరిద్దరి తరఫున లొంగుబాటు కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మావోయిస్టు అగ్రనేతల్లో గణపతి, మల్లోజుల కోటేశ్వరరావు, తిప్పిరి తిరుపతి, కడారి సత్యనారాయణ, పుల్లూరు ప్రసాద్, మల్లా రాజిరెడ్డిలతోపాటు కేంద్ర కమిటీలో మెజార్టీ సభ్యులు తెలుగు వారే ఉన్నారు.

# 227 మంది ప్రాణాలతో పాక్ చెలగాటం

దిల్లీ: ఉరుములు, మెరుపులతో కూడిన కారుమబ్బులు. విమానం అలాగే ముందుకు చొచ్చుకువెళితే అందులోని ప్రయాణికులందరికీ ప్రాణగండం! కాస్తంత దారి మార్చి పక్కకు వెళదామంటే దాయాదిదేశం పాకిస్థాన్ గగనతలంలోకి వెళ్లక తప్పని పరిస్థితి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సునాయాసంగా పక్కదేశ గగనతలంలోకి వెళ్లలేని దుస్థితి...అయినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో విమానాన్ని పాకిస్థాన్ గగనతలంలోకి తీసుకెళ్లడానికి పైలట్లు అభ్యర్థించారు. అయితే పాకిస్థాన్ అధికారుల పాషాణ హృదయం కరగలేదు. విమానాన్ని అనుమతించడానికి ససేమిరా అన్నారు. విధిలేని పరిస్థితుల్లో పైలట్లు ఆ లోహవిహంగాన్ని ఉరుములు, మెరుపులు, వడగళ్ల వానతో కూడిన కారుమబ్బుల్లోకి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో అది తీవ్ర కుదుపులకు లోనైంది. ప్రమాదపుటంచులకు చేరువైంది. వేల అడుగుల ఎత్తునుంచి అత్యంత వేగంగా కిందకు జారడం మొదలైంది. విమానంలోని ఒక్కొక్క వ్యవస్థా మొరాయించసాగాయి. వడగళ్లు అత్యంత బలంగా విమానాన్ని తాకుతున్నాయి. భారీ కుదుపులకు ప్రయాణికులు హాహాకారాలు చేస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో పైలట్లు ఎంతో ధైర్యసాహసాలతో విమానాన్ని ముందుకు నడిపించారు. చాకచక్యంతో కిందికి దించారు. 227 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడారు. బుధవారం దిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో 6ఇ 2142 విమాన ప్రయాణికుల భీతావహ అనుభవం ఇది. ఈ ఘటనపై భారత పౌరవిమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) శుక్రవారం ఒక సవివర ప్రకటన విడుదల చేసింది.

**ఏం జరిగింది?**

శ్రీనగర్‌కు చేరే క్రమంలో పఠాన్‌కోట్ వద్ద ఈ విమానానికి ప్రతికూల వాతావరణం ఎదురైంది. దీంతో నిర్దేశిత ప్రయాణ మార్గానికి ఎడమవైపునకు (అంతర్జాతీయ సరిహద్దు దిశగా) మళ్లడానికి అనుమతించాలని వైమానిక దళానికి చెందిన నార్తర్న్ కంట్రోల్‌కు పైలట్లు విజ్ఞప్తి చేశారు. ఇలా వెళ్తే విమానం కొద్దిసేపు పాక్ గగనతలంలో ప్రయాణించాల్సి వస్తుంది. అయితే ఇండిగో పైలట్ల విజ్ఞప్తిని నార్తర్న్ కంట్రోల్ తిరస్కరించింది.

- భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తూ పాక్ పౌరవిమానయాన అధికారులు ఇచ్చిన 'నోటమ్'ను గుర్తుచేస్తూ ఇండిగో సిబ్బందికి ఆ సూచన చేశామని వైమానిక దళ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆ విమాన ప్రయాణ మళ్లింపు ప్రణాళికపై సమన్వయం చేసుకోవడంలో తాము సాయం అందించినట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో దిల్లీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో మాట్లాడామని, లాహోర్ ఏటీసీని సంప్రదించడానికి అవసరమైన ఫ్రీక్వెన్సీలను ఇండిగో సిబ్బందికి అందజేశామని తెలిపాయి.
- దీనిప్రకారం ఇండిగో విమాన పైలట్లు.. లాహోర్ ఏటీసీని నేరుగా సంప్రదించారు. ప్రతికూల వాతావరణం కారణంగా పాక్ గగనతలంలో కొద్దిసేపు ప్రయణించేందుకు అనుమతి కోరారు. అటువైపు నుంచి తిరస్కరణ ఎదురైంది.
- ఒకవైపు ఉరుములు, మెరుపులతో కూడిన కారుమేఘం (థండర్‌స్టార్మ్ క్లౌడ్) కమ్ముకొస్తోంది. ఈ పరిస్థితుల్లో విమానాన్ని తిరిగి దిల్లీకి మళ్లించాలని పైలట్లు తొలుత భావించారు. అయితే అప్పటికే ఆ లోహవిహంగం.. కారుమేఘానికి బాగా చేరువగా వచ్చేయడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో అందులోకి ప్రవేశించాలని నిర్ణయించారు.

# ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఒకే వేదిక మీదకు వచ్చారన్నారు. పర్యాటకంతోపాటు వివిధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

**మోదీకి సెల్యూట్ చేస్తున్నా: ముకేశ్ అంబానీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సదస్సులో ప్రశంసలు కురిపించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంలో ప్రధాని నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అన్నారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. మన సాయుధ దళాల శౌర్య పరాక్రమాలకు గర్వపడుతున్నట్లు తెలిపారు.

# అమరావతిని రాజధానిగా నోటిపై చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడంలేదని, కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి? రాజధాని కోసం రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ? హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని అలాగే ఉంచుకుంటే మీరు అక్కడే ఉంటారు, రాజధానికి ఇస్తే చరిత్ర తిరగరాస్తారు, మీ జీవితాలు కూడా మెరుగుపడతాయని చెప్పడంతో ఇచ్చారు. అమరావతి శక్తి చాలా బలమైంది' అని చంద్రబాబు అన్నారు.

**బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు రావాలి**

'మేం బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు అమరావతికి రావాలని కోరుకుంటున్నాం. దానికి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు పెట్టదు. ఇన్వెస్టర్లే కడతారు. దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అమరావతికి అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. విశాఖను అత్యుత్తమ నగరంగా మార్చడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నాం. దాన్ని ఆర్థిక, విజ్ఞాన నగరంగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం ప్రకటించారు.

**సంపద సృష్టించేది ప్రభుత్వ విధానాలే**

దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కావాల్సింది మంచి ప్రభుత్వ విధానాలే తప్పితే డబ్బు కాదని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆర్థిక సంస్కరణల తర్వాత గ్రోత్ రేట్ అసాధారణంగా పెరిగింది. ప్రభుత్వ విధానం కింద ఐటీని ప్రోత్సహించడం వల్ల మనకు విస్తృత ప్రయోజనం దక్కింది. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ వచ్చినప్పుడు కేంద్రం ఎంత డబ్బులు ఇస్తుంది? అని అందరూ అడుగుతుంటారు. ఇక్కడ సంపద సృష్టించడానికి సరైన ప్రభుత్వ విధానాలు కావాలి. 20 ఏళ్ల క్రితం మన ఎయిర్‌పోర్టులు ఎలా ఉండేవో తెలుసుకదా.. వాటికి భిన్నంగా మేం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. దాని గురించి ప్రతిపాదించినప్పుడు డబ్బులు ఎక్కడున్నాయని నాటి ప్రధానమంత్రి వాజపేయీ కూడా అడిగారు. అప్పుడు మేం డబ్బు అవసరం లేదు.. అడిగిన పాలసీ ఇవ్వండి అని కోరాం. మీకు ఆసక్తి ఉంటే అందులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాటా పెట్టుకోండి, లేకపోతే అదికూడా వద్దని చెప్పాం. ప్రభుత్వ వాటా ఉంటే అక్కడ జరిగే వాణిజ్యంలో మీకూ ఆదాయం వస్తుందని తెలిపాం.



## శ్రీ గోమాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

అంబర్ పేట మే 23 (సమయం న్యూస్) : అంబర్ పేట ప్రేమ్ నగర్ లో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ గోమాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అనంతరం పెద్ద ఎత్తున భజనలు చెసి హనుమాన్ శోభయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వంజరి బాలకృష్ణ, శ్యామ్, భాన,చింతల సాయి, కృష్ణ, చందు, అజయ్, గౌతమ్, శ్రీకాంత్, శ్రీధర్ , ఉదయ్, శివకుమార్ ,లడ్డు, జీవన్ ,నాని పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

# హైదరాబాదులో మరో మెగా స్పోర్ట్స్ ఈవెంట్

* ఈనెల 27 నుండి జాతీయ సబ్ జూనియర్ రోయింగ్ ఛాంపియన్ షిప్
* పోస్టర్ రిలీజ్ చేసిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి




అంబర్ పేట మే, 23(సమయం న్యూస్) : తెలంగాణ రాష్ట్రము హైదరాబాద్ నగరము మరో మెగా ఈవెంట్ కు ఆతిధ్యం ఇవ్వబోతుంది. మే 27 నుండి 31 తేదీ వరకు హుస్సేన్ సాగర్ లేక్ లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ ఛాంపియన్ షిప్ కు హైదరాబాద్ ఆతిధ్యం ఇవ్వనుంది. అండర్ 13 అండర్ 15 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాల్లో జరిగే ఈ పోటీలలో 23 రాష్ట్రాల నుండి దాదాపు దాదాపు 350 మంది రోయర్లు ఇందులో పాల్గొనబోతున్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్ ను ఈరోజు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎల్బీ స్టేడియం లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ జరూర్ ఆనా అన్న నినాదంతో టూరిజం ప్రమోషన్ కు కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ టూరిజాన్ని కూడా ప్రమోట్ చేసే చర్యల్లో భాగంగా ఎన్నో జాతీయ అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో గత ఏడాది కాలంగా , రాష్ట్రంలో ఉన్న అన్ని క్రీడా మైదానాలు క్రీడాకారులతో కళ కళ లాడుతున్నాయని, క్రీడారంగంలో కొత్త జోష్ తో కార్యక్రమాలు నడుస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు కూడా అత్యంత వైభవంగా దిగ్విజయంగా కొనసాగుతున్నాయని, గతంలో లోకన్నా రెట్టింపు సంఖ్యలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఉచిత యోగ జుంబా డ్యాన్స్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రతిరోజు మైదానానికి వచ్చి ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. మరిన్ని జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు హైదరాబాద్ వేదిక కాబోతోందని ఆయన తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఎండి శ్రీమతి సోనీ బాలాదేవి మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాల తర్వాత ఈ టోర్నమెంట్ కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వబోతుందని, స్పోర్ట్స్ అథారిటీ తరపున సంపూర్ణ సహకారం అందజేస్తూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత రోయింగ్ కోచ్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ లు ఈ పోటీల విజయవంతనికి కృషి చేస్తున్నాయని ఆసియన్ ఛాంపియన్షిప్ క్యాంపుకు హైదరాబాద్ వేదిక కాబోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్ సుజాత మమత, అనిత,, స్పెషల్ ఆఫీసర్ భాష స్టేడియం అడ్మినిస్ట్రేటర్ ఎన్ కె గోకుల్, అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణితదితరులు పాల్గొన్నారు.

## పొద్దు తిరుగుడు ధాన్యం విక్రయించిన రైతులకు నగదు వెంటనే జమ చేయాలి



తోగుట మే 23 (సమయం న్యూస్) : సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి. తొగుట మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు ముగిసి దాదాపుగా నెల రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాలలో పూర్తిస్థాయిలో నగదు జమ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మండలంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సొసైటీ ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కొనుగోలు కేంద్రాలకు దాదాపు నాలుగు మండలాల నుండి రైతులు ధాన్యాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.789 మంది రైతుల నుండి, 8387 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు ధాన్యాన్ని సేకరించిమార్కెట్ లకు తరలించడం జరిగిందన్నారు. అందుకుగాను కేంద్ర ప్రభుత్వం కోట ద్వారా 339 మంది రైతులకు దాదాపుగా రెండు కోట్ల డెబ్బై లక్షల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వాటా కింద 450 మంది రైతుల నుండి 4529 క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. అందుకు సుమారుగా మూడు కోట్ల 28 లక్షల రూపాయల వరకు రైతుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు నిధులను విడుదల చేయాలన్నారు. మరో రెండు రోజులలో రోహిణి కార్తె ప్రారంభం అవుతున్నందున రైతులకు పెట్టుబడిగా ఈ నగదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి,డైరెక్టర్ శ్రీధర్, సీఈవో గంగారెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.




## మున్సిపల్ కార్మికుల ధర్నా

- కనీసవేతనం 26వేలు ఇవ్వాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు

జిన్నారం, మే 23, సమయం న్యూస్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించి, మేనేజర్ కు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర రావు మాట్లాడుతూ, పటాన్చెరు నియోజకవర్గంలో కొత్తగా గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ మున్సిపాలిటీగా అవతరించాలని ఆయన అన్నారు. నాలుగు నెలల కాలం గడుస్తున్న ప్రతినెల సమయానికి వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు .ప్రతి సంవత్సరం ఇచ్చే యూనిఫామ్ ఇవ్వలేదని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. మునిసిపల్ సిబ్బందికి వెంటనే ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ప్రతినెల 5వ తేదీ వరకు వేతనాలు వచ్చే విధంగా కమిషనర్ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది భాస్కర్, యాదగిరి, మల్లేష్, మహేందర్ ,నగేష్ చారి, మహిళా మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### జన్మదిన సందర్భంగా

## సైనికుల సహాయనిధికి విరాళం అందించిన రఘువీరారెడ్డి





నర్సాపూర్ మే, 23 (సమయం న్యూస్): దేశంలో ఎంతో మంది తమ హోదా తగ్గట్టు జన్మదిన వేడుకలు జరుపుకుంటారు దీని వలన డబ్బు ఎంతో ఖర్చు చేస్తారు.మరి కొంతమంది పేద ప్రజలకు ఏదో విధంగా సహాయం చేస్తారు కానీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి తన జన్మదిన వేడుకలు జరుపుకోకుండా ఉగ్రవాదుల చేతిలో మరణించిన ప్రజలను దేశ సరిహద్దులలో ప్రజలను కాపాడడం కోసం యుద్ధం చేసి ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులను గుర్తు చేసుకుంటూ సైనికుల సహాయ నిధికి(1,11,116) ఒక లక్ష పదకొండు వేల నూట పదహారు రూపాయల చెక్కును హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి రఘువీరారెడ్డి అందించడం జరిగింది. ఇలా ప్రతి ఒక్కరు దేశం కోసం మన సైనికుల కోసం వారికి సహాయం అందించాలనే ఆలోచన అందరికీ రావాలని ఇలా ఎంతోమంది సైనికుల సహాయనిధికి సహాయం చేయాలని కోరుకుంటున్నారు.



## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పట్టించుకోని రైల్వేఅధికారులు

వెల్దుర్తి/మసాయి పెట్ మే 23, సమయం న్యూస్ : మెదక్ జిల్లా మాసాయిపేట పట్టణ కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ మాసాయిపేట నుండి అచ్చంపేట అకింపేట్ ధర్పల్లి వెళ్లే అండర్ బ్రిడ్జి లో చినుకు పడితే కుంటలా మారిపోతున్న బ్రిడ్జి ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోని వైనం వర్షాకాలం వచ్చిందంటే స్కూల్ పిల్లలకు బ్రిడ్జి లోనుండి వెళ్లడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని అలాగే మోటార్ సైకిల్స్, వెహికల్స్ వెళ్లడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్న రైల్వే అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాసాయిపేట సంబంధించిన బ్రిడ్జి కోసం పార్లమెంట్లో మాట్లాడిన విషయం తెలిసిందే అలాగే ఈ బ్రిడ్జి లో కూడా వాటర్ పోయేలా కాంట్రాక్టర్కు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు అధికారులకు చెప్పాలని చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్పందించి తక్షణమే బ్రిడ్జి మరమ్మత్తులు చేపించి వాటర్ వెళ్లేలా చేయాలని మాసాయిపేట, గోపాలకృష్ణ పురం, హకీంపేట, అచ్చంపేట, ధర్పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

## కాశి పూజాదులు తో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం ఈఓ కార్యాలయంలో సరస్వతి నవరత్న మాలా హారతి నిర్వహిస్తున్న కాశీ పూజారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సరస్వతి పుష్కరాలు ప్రారంభం నుండి ప్రతి రోజు రాత్రి సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. గత ఎనిమిది రోజులుగా సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం విశేషంగా భక్తుల మన్ననలు పొందుతుందని తెలిపారు. ఇది మన సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

: ఫైర్ శాఖ డి.జి నాగిరెడ్డి



హైదరాబాద్, మే 23:(సమయం న్యూస్) అగ్నిప్రమాదాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వార్ హాల్ అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా శాఖలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో పురాతన భవనాల లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు శాఖాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నాగిరెడ్డి వివరణ కోరారు. ఇటీవల గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం సభ్య సమాజాన్ని తీవ్ర ఆందోళన కు గురిచేసిందని, అలాంటి పురాతన భవనాల్లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్య ల ఆయా శాఖల ద్వారా కావలసిన సూచనలు ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముఖ్యంగా జిహెచ్ఎంసి లో వ్యాపార సముదాయాలు, వ్యాపారం చేసే భవనంలో అగ్ని ప్రమాదం సంభవించకుండా నిరోధించే చర్యల పై ముందస్తు అవగాహన కల్పించి, పాటించని యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని సూచించారు. హై రేంజ్ బిల్డింగ్ లో గాని, ఇతర బిల్డింగ్ లో షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదాలు సంభవించకుండా ఎలాంటి పరికరాలు వాడాలో ఎలక్ట్రికల్ అధికారులు ప్రైవేటుగా ఫిట్టింగ్ చేసే వ్యక్తులకు అదే విధంగా లైన్ మెన్ లకు పూర్తి అవగాహన కల్పించాలని, అంతేకాకుండా ఎలక్ట్రిక్ షాప్ లు నిర్వహించే యజమానులకు దశల వారీగా అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని డిస్కమ్ సి.ఈ ని కోరారు. అదే విధంగా టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ఫైర్ సేఫ్టీ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, సేఫ్టీ మెజర్స్ ఉంటేనే ట్రేడ్ లైసెన్స్ గాని, ఎన్.ఓ.సి జారీ చేయాలని సూచించారు. నెలకు ఒక రోజు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు నాగి రెడ్డి వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రభుత్వానికి సూచించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ... శిథిలావస్థలో భవనాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. డి జి గారి సూచన మేరకు వ్యాపార సముదాయాలు, వ్యాపార భావనాలలో ఫైర్ సేఫ్టీ విషయంలో పకడ్బంది చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు నూతన నిర్మాణం కొరకు అనుమతి కోసం వచ్చే ప్లాన్ లో ఫైర్ సేఫ్టీ ప్రాధాన్యత నివ్వాలని కోరారు.వ్యాపార సముదాయాలు, వ్యాపార భవనాలలో ఫైర్ సేఫ్టీ పై చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ... ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో ఫైర్, పోలీస్ శాఖ మాత్రమే సమాచారం వెళుతున్నదని, అట్టి సమాచారం రెవెన్యూ సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలని జిల్లా యంత్రాంగం తరపున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స అందించడం బెడ్స్ ,, డాక్టర్లను సిద్ధం చేయడం లాంటి చర్యలు సకాలంలో తీసుకునే వెసులుబాటు ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 15 మీటర్ల లోపు ఉన్న భవనాలు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్, లాడ్జింగ్, హోటల్, బిజినెస్ మాల్స్, స్టోరేజీ బిల్డింగ్ లు తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. తప్పని సరిగా స్మోక్ డిటెక్టర్ తో పాటు అల్లారం కూడా ఉండాలని ఇది నగర వాసులు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంకన్న, ప్రదీప్, డిస్కమ్ సి.ఈ, హైడ్రా, ఫైర్ అధికారులు, ట్రాన్స్మిషన్ ఎలక్ట్రిసిటీ అధికారులు తమ సూచనలు ఇచ్చారు.



# గృహనిర్బంధం అత్యంత హేయమైన చర్య

- **గుమ్మడిదల రైతు జేఏసీ అధ్యక్షుడు**

గుమ్మడిదల , మే 23, సమయం న్యూస్ : డంప్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న జేఏసీ నాయకులను గృహనిర్బంధంలో ఉంచడం అత్యంత హేయమైన చర్య అని గుమ్మడిదల గ్రామ రైతు జేఏసీ అధ్యక్షులు సదానంద రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ నల్లవల్లి గ్రామ పరిధిలో ప్రతిపాదిత డంప్ యార్డుకు వ్యతిరేకంగా గత 107 రోజులుగా శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన దృశ్య డంప్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఉద్యమిస్తున్న సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్, గుమ్మడిదల జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని, నల్లవల్లి గ్రామ నాయకులను గృహనిర్బంధంలో ఉంచడం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు సదానంద రెడ్డి మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హానికరమైన డంప్ యార్డ్ ను ప్రతిఘటిస్తూ, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న నాయకుడు గోవర్ధన్ రెడ్డిని అణిచివేయాలనే కుట్రతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. ఇలాంటి ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో ఉద్యమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. నల్లవల్లి, ప్యారానగర్ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి ప్రతిపాదిత డంప్ యార్డును పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జేపీసీ నాయకులు చిమ్ముల దేవేందర్ రెడ్డి, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, మల్లేష్ యాదవ్ ,వెంకటేష్ యాదవ్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పలు హాస్టళ్లను తనిఖీ చేసిన టాస్క్

- **నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు**
- **30 హాస్టళ్లకు నోటీసులు జారీ, 5 హాస్టళ్ల కిచెన్ ల సీజ్**
- **రూ. 2.5 లక్షల జరిమానా**

హైదరాబాద్, మే 23( సమయం న్యూస్) : జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలు పాటించని హాస్టళ్ల పై ఫుడ్ సేఫ్టీ తో పాటుగా ఇతర శాఖల తో ఏర్పడిన టాస్క్ ఫోర్స్ బృందాలు శుక్రవారం అమీర్‌పేట, అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్ మొదలైన ప్రాంతాల్లో పలు హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ మహిళలు, పురుషులు, విద్యార్థుల అవసరాలను తీర్చడానికి అనేక ప్రైవేట్ హాస్టళ్లు ఆహార భద్రత, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, అగ్ని ప్రమాద నివారణ మొదలైన నిబంధనలను ఉల్లంఘిస్తూ హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, నియమ నిబంధనలను ఉల్లంఘించి పెద్ద హోర్డింగ్ లను ప్రదర్శించడం, అపరిశుభ్రంగా తయారు చేస్తున్న నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థును పెట్టడం, సరిపోను సరైన మరుగుదొడ్లు





వంటి వారి ప్రాథమిక అవసరాలను విస్మరించారు. అంతేకాకుండా వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతోంది. నిర్వాహకుల తో పాటుగా, భవన యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు ఇప్పటికీ అపరిశుభ్రమైన పరిస్థితులు నిర్వహించడంలో బాధ్యతా రహితంగా ఉన్నాయి. ఇది ప్రజలకు ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అటువంటి ఉల్లంఘనలను అరికట్టడానికి, జీహెచ్ఎంసీ అంతటా చట్టాలను ఉల్లంఘించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న హాస్టళ్లపై (ఉదాహరణకు అమీర్‌పేట, ఖైరతాబాద్ జోన్, అశోక్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించడానికి జీహెచ్ఎంసీ అధికారులతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాలలో సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి, 30 హాస్టళ్లకు నోటీసులు జారీచేసి, 5 హాస్టల్ కిచెన్‌లను మూసివేయబడ్డాయి. జీహెచ్ఎంసీ 1955 యాక్ట్ నిబంధనల ప్రకారం రూ.2,45,500/ జరిమానా విధించారు.






# సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షలలో ప్రతిభ చాటిన విజ్ఞాన్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు

బోధన్ పట్టణం, మే 23, సమయం న్యూస్ : 2025 ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షలో విజ్ఞాన్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. బోధన్ పట్టణంలోని ఈ ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌కు చెందిన 23 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో 17 మంది అర్హత సాధించారు. ఇది ఈ ప్రాంత విద్యారంగానికి గర్వకారణంగా మారింది. పోతంగల్ గ్రామానికి చెందిన సూదం మయాంక్ 300 మార్కులకు గాను 283 మార్కులతో జాతీయ స్థాయిలో 361వ ర్యాంకు సాధించి రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకుతో ప్రతిభను చాటాడు. ఈ అద్భుత విజయంపై సబ్ కలెక్టర్ వికాస్ మహతో విద్యార్థులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలను అందజేసి అభినందనలు తెలిపారు. ఇలాగే విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించే విధంగా కోచింగ్ నిర్వాహకులైన వివేక్ విద్యార్థులను మరింత తీర్చిదిద్దాలని కోరారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వివేక్ మాట్లాడుతూ, "ఈ విజయం మా టీచర్లు, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి ఫలితంగా సాధ్యమైంది. భవిష్యత్తులో మరిన్ని విద్యా కుసుమాలను వికసింపజేయాలన్నదే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు కోచింగ్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు. విజ్ఞాన్స్ కోచింగ్ సెంటర్, బోధన్ - సైనిక్ స్కూల్ ప్రవేశాలకు విశ్వసనీయ కేంద్రంగా ఎదుగుతోంది.

# నకిలీ పత్తి విత్తనాల నియంత్రణ కు కఠిన చర్యలు

: **జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

- **నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై టాస్క్ పోర్స్ సమన్వయ సమావేశం**

మహబూబ్ నగర్ మే 23( సమయం న్యూస్) : ప్రభుత్వ అనుమతి లేని BG 3 నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణకు పోలీస్,వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన టాస్క్ పో ర్స్ టీమ్ లు విస్తృతంగా తనిఖీ లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఎస్.పి.డి.జానకి తో కలిసి నకిలీ విత్తనాల నియంత్రణపై వ్యవసాయ అధికారులు,పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ పోర్స్ టీమ్ ల సమన్వయ సమావేశం లో కలెక్టర్ వర్షాకాలం వర్షాకాల ముందస్తు వ్యవసాయ ప్రణాళిక,నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ నెల కంటే ముందే వర్షాలు పడుతున్నందున వ్యవసాయ పనులు మొదలు కానున్నట్లు తెలిపారు.జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి సాగు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారుగా 75 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని BG 3 నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణకు కు పోలీస్,వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ పోర్స్ టీమ్ లు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి లేని BG 3 పత్తి విత్తనాలు నిల్వ చేయడం,అమ్మడం, విత్తడం,ఎం. అర్.పి.కంటే అధిక ధరకు అమ్మడం చట్ట రీత్యా నేరం అన్నారు. అటువంటి వారిపై 10 సం. ల వరకు జైలు శిక్ష,పి డి.ఆక్ట్ నమోదు తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.నకిలీ BG 3 పత్తి విత్తనాల వలన భూ సారం దెబ్బ తినడమే కాక వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు.ప్రభుత్వం అందుకే వాటిపై నిషేధం విధించినట్లు తెలిపారు..నకిలీ పత్తి విత్తనాలు చే తయారు చేసిన దుస్తులు ధరిస్తే స్కిన్ క్యాన్సర్ వస్తుందని అన్నారు. నేటి నుండి(మే 24) నుండి 28 వరకు 16 టాస్క్ పోర్స్ టీమ్ లు జిల్లాలో 259 డీలర్ ఔట్ లెట్ లను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో గడువు తేదీ దాటిన విత్తనాలు అమ్మినా,నిల్వ ఉంచిన,అనుమతి లేని నకిలీ విత్తనాలు విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో ఇప్పటికే 1,19,000 పత్తి విత్తనాలు సరఫరా చేసినట్లు వెల్లడించారు. నాణ్యమైన ప్రభుత్వ అనుమతి గల BG 2 పత్తి విత్తనాలు మాత్రమే రైతులు లైసెన్స్ ఔట్ లెట్ డీలర్ ల నుండి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ జూన్ మొదటి వారం లో టాస్క్ పోర్స్ టీమ్ లతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.చెక్ పోస్ట్ ల్లో కూడా గట్టి నిఘా ఉంచి తనిఖీ లు నిర్వహించాలని అన్నారు ఎస్.పి.డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణ చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని,ఎటువంటి సమాచారం ఉన్నా ముందుగా తెలిపితే పోలీస్ శాఖ నుంచి తగిన పోర్స్ పంపిస్తామని అన్నారు. గత సంవత్సరం జడ్చర్ల మండలం గోపులా పూర్ లో 151 కిలోలు,51 కిలోలు నకిలీ పత్తి విత్తనాలు పట్టుకొని రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం కూడా గొపులా పూర్ లో లక్ష 50 వేల రూ.ల విలువ కలిగిన 30 కిలోలు నకిలీ పత్తి విత్తనాలు మధు సూధన్ రెడ్డి వద్ద స్వాధీనం చేసుకొని చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. 5 చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు,డీలర్ ఔట్ లెట్ లను తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అదనపు ఎస్.పి.రాములు,డి.ఎస్.పి.వేంకటేశ్వర్లు,డి.సి.అర్.బి డి.ఎస్.పి.రమణా రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్,సి.ఐ లు,ఎస్. ఐ.లు,వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమి ద్వారా డ్రాయింగ్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

బోధన్ పట్టణం, మే 23, సమయం న్యూస్ : తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ డ్రాయింగ్ శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తయింది. శుక్రవారం రోజున బోధన్ పట్టణంలోని పిఆర్టియు భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఖైరాన్, ఎంబెల్లి శంకర్, గంగాధర్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి తనలోని కళా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలను తప్పక ఉపయోగించుకోవాలి," అని సూచించారు. చిత్రకళ మనసులోని భావాలను వెలికితీయగల శక్తివంతమైన సాధనం అని వారు పేర్కొన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవడంతో పాటు , భవిష్యత్తులో గొప్ప చిత్రకారులుగా ఎదగే అవకాశాలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమి డైరెక్టర్ లక్ష్మణ్ (తేజ), చిత్రకళా బోధకులు ఎర్రోల్ల అవంతి కూడా పాల్గొన్నారు. తేజ అకాడమి ఈ ప్రాంతంలో బాలల చిత్రకళా శిక్షణకు విశ్వసనీయ కేంద్రంగా మారుతోంది.

# అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నాం

కంగ్టి, 23మే,(సమయం న్యూస్) : సీఎం సభ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రజా నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నాం. పోరాటాలతో ఉద్యమాలను ఆపలేరు. ఈ సందర్భంగా కంగ్టి మండల నాయకులు శివరాజు మాట్లాడుతూ జహీరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో సభ వద్దకు సిపిఎం పార్టీ నాయకులు వెళ్లి ప్రజల సమస్యలు కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమైన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం కొంతమందిని హౌస్ అరెస్ట్ చేయడం అనేది సిగ్గుచేటు అని




అన్నారు. గత ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని వాటిపై సిపిఎం పార్టీ సిఐటియు ప్రజా సంఘ నాయకులు నిరంతరం పోరాటాలు చేస్తుందని ప్రస్తుతం కార్మిక సమస్యలు నిమ్జ్ భూములు కోల్పోయిన రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని ఆ దిశగా పార్టీ ఆలోచిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పార్టీ నాయకులను అరెస్టు చేయడం అంటేనే ప్రభుత్వం పడిపోయే స్థితిలో ఉందని అర్థం. గత ప్రభుత్వాలు కూడా రైతులను అరెస్టు చేస్తే వాళ్లకు ఎలాంటి పుట్టగతులు లేకుండా చేశారో ఈ ప్రభుత్వాన్ని కూడా రాబోయే రోజుల్లో అలాంటి పరిస్థితి నెలకొంటుందని అన్నారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ఈ సభ పెడితే ప్రజల యొక్క అభిప్రాయం తీసుకోవాలి కదా ప్రజాపాలనంటే అదే కదా మరి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలన చేయట్లేదని ఈ ప్రభుత్వాన్ని ఎండకట్టడం కోసం ప్రజలను కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఇప్పటికైనా అరెస్ట్ విడుదల చేసి అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని అన్నారు. లేనియెడల రాబోయే రోజుల్లో ఉద్యమాలతో గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని సిఐటియు నాయకులు హెచ్చరించారు.



# వీధి వ్యాపారులకు భరోసా

* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
* **జిల్లా ఎస్ పి తో కలిసి పరిశీలన**

ఆదిలాబాద్ మే23(సమయం న్యూస్) : వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించిన ప్రాంతాన్ని పరిశీలించి భరోసా కల్పించిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా జిల్లా సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ అఖిల్ మహాజన్ శుక్రవారం జిల్లా కేంద్రం లో వీధి వ్యాపారులకు నూతనంగా పునరావాసం కల్పించిన పాత గణేష్ థియేటర్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాసం కల్పించిన చోట సరియైన సౌకర్యాలు ఉన్నాయా, లేవా, వారి పరిస్థితులు ఎలా ఉందో నేరుగా వ్యాపారుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం, పార్కింగ్ , తదితర ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఒకవేళ తొలగించడం జరిగితే వారి ఇష్టం , అంగీకారం మేరకు చర్యలు జరిపిన పిదప ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించి మాత్రమే తొలగించాలని మున్సిపాలిటీ తీర్మానం చేయించడం జరిగిందనీ వీధి వ్యాపారులకు భరోసా కల్పించిన నేపథ్యంలో వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ కుమార్, డిఎస్పి జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవియన్ రాజు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# పేదింటి ఆడపడుచు వివాహానికి పుస్తే మట్టెలు అందజేసిన సంఘ సేవకులు. !!

* **సేవ రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్..**

శివంపేట్ మే 23( సమయం న్యూస్) : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన (పేర్క) సుబ్బురి మాధవి మహేష్ దంపతుల కూతురు నాగేశ్వరి వివాహానికి పుస్తెమెట్టలు బహుకరించిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అనునిత్యం ప్రజలలో ఉండే నాయకుడు కాంగ్రెస్ నాయకులు హిందూ బీసీ నాయకులు. ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ బండారి క్రాంతి చేతుల మీదుగా పుస్తె మెట్టెలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజీ ఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు బిజి ఆర్ యువ కిరీటం బండారి సాయి కిరణ్ మాజీ సర్పంచ్ ఆకుల నర్సింలు మాజీ ఎంపిటిసి ఆనంద్ యాదవ్





మాజీ ఉప సర్పంచ్ కొండలు హిందూ బిసి మహాసభ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పెద్ద నరసన్న శేఖర్ సుబ్బురి సందీప్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ మే 23(సమయం న్యూస్) : జిల్లాలో బాల్యవివాహాలకు పూర్తి స్థాయిలో నియంత్రించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు, రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించినవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ మళ్ళీ వివాహం జరపకుండా చూడాలన్నారు.సంబంధిత బాలబాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ, కేంద్రాలలో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఎంపి లు ప్రథమ చికిత్స తప్ప, ఏ ఇతర చికిత్సలను చేయకుండా నియంత్రించాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు. విద్యా సంస్థల 400 మీటర్ల పరిధిలో గుట్కా, సిగరెట్ అమ్మకాలను నిషేధించాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అధిక ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. తరచూ ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో సూచికల బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కేసుల విచారణ వేగవంతంగా ఉండాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు.నకిలీ వ్యవసాయ విత్తనాల అమ్మకానికి అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీలు చేయాలనీ అన్నారు.విత్తనాల నాణ్యతపై





అనుమానాలు ఉంటే నాణ్యతా పరీక్షలకు పంపాలని, నిషేధించిన విత్తనాలు, పురుగుల మందుల వాడకంపై నిషేధం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించిన దుకాణదారులు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమంగా ఇసుక త్రవ్వకాలు చేపట్టినా, నిల్వ ఉంచిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. గృహ, ఇతర నిర్మాణాల అవసరాలకు రుసుములు చెల్లించి, రసీదులు పొందిన వారికి మాత్రమే ఇసుకను సరఫరా చేయాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించడానికి సంక్షేమ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే ట్రాఫిక్, మహిళా పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ మత్తుపదార్థాల వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తామని తెలిపారు. గంజా, నిషేదిత మత్తుపదార్థాలు వినియోగించిన, రవాణా చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 8712659599 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గంజా, నిషేదిత మత్తుపదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీసు, అబ్కారీ, ఆర్ అండ్ బి, మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదులు నిర్మాణం

- **న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో నాలుగు గదుల భవన నిర్మాణం**
- **మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్**

జిన్నారం, మే 23, సమయం న్యూస్ : శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో 50 లక్షల రూపాయలతో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం జరిగిందని, జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం ఆగస్టు 15వ రోజు జరిగిన సమావేశంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులకు తరగతి గదుల ఇబ్బంది ఉందని తన దృష్టికి తేవడం జరిగిందని అన్నారు. ఇట్టి



విషయాన్ని గౌరవ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారికి తెలపగా, వారు న్యూల్యాండ్ పరిశ్రమతో మాట్లాడి 50 లక్షల రూపాయలతో నాలుగు తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యే కు, న్యూ ల్యాండ్ పరిశ్రమ యజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి పనులను అతి త్వరలోనే ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.



# మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి నష్టపరిహారం

- **కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి**

జిన్నారం,మే 23, సమయం న్యూస్ : విద్యుత్ షాక్ తో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి, బిల్డర్ నుండి ఆనంద్ కృష్ణారెడ్డి నష్టపరిహారం ఇప్పించిన సంఘటన శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న నక్క శ్రీనుబాబు విద్యుత్ షాక్ తో మరణించడం జరిగింది. చందానగర్ లో నిర్మాణంలో ఉన్న ఇంటిలో కరెంటు పని చేస్తుండగా షాక్ తలిగి శ్రీనుబాబు మృతి చెందాడు. ఇట్టి విషయాన్ని మృతుని బంధువులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డికి సమాచారం ఇవ్వగా, చందానగర్ లోని ఇంటి యజమానిని పిలిపించి మృతుడు శ్రీనుబాబు భార్య కుమారికి 13 లక్షల రూపాయల నష్టపరిహారం ఇప్పించడం జరిగింది .మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు .మృతుని కుటుంబం తరఫున మాట్లాడి నష్టపరిహారం ఇప్పించిన ఆనంద్ కృష్ణారెడ్డికి మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

* **జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే23( సమయం న్యూస్) : జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు క్రైస్తవ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల హిమాన్షు ట్రేడర్ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించి స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు పరిశీలించి అక్కడి రైతులకు విక్రయిస్తున్న ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంచే గుర్తించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విక్రయ సమయంలో సంబంధిత





కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా కొనుగోలుదారుకు అందించాలని తెలి పారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్ లను రద్దుచేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. దుకాణంలో నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని సత్యసాయి ఫర్టిలైజర్స్ షాపును తనిఖీ చేసి రైతులకు విక్రయిస్తున్న కంపెనీ విత్తనాల వివరాలు తెలుసుకున్నారు. రైతుల కోరిక మేరకు అన్ని కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, విత్తన విక్రయ సమయంలో కొనుగోలుదారుకు తప్పనిసరిగా రసీదు అందించాలని, నకిలీ, నిషేధిత విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు విత్తన ప్యాకెట్లను భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విత్తనాలను విక్రయించాలని, డివిజన్ లో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా, ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతిరోజు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఎ డి ఎ మనోహర్, తహసిల్దార్ కిరణ్, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు రాష్ట్రస్థాయి నుండి

# ప్రాతినిత్యం వహిస్తున్న చందుకు ఆర్థిక సహాయం చేసిన మాజీ ఎంఈఓ

బోధన్ పట్టణం, మే 23, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బోధన్ మండలం సంఘం గ్రామానికి చెందిన భానోత్ చందు జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల మెదక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ లో నిజామాబాద్ జిల్లా తరఫున పాల్గొన్న చందు, ఉత్తమ పిచర్‌గా ఎంపికయ్యారు. ఈ విజయంతో చందు, మే 29 నుండి చండీగఢ్ లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో





రాష్ట్రం తరఫున ఎంపిక కావడం గర్వకారణం. చందు కుటుంబం ఆర్థికంగా వెనుకబడినదైనా, తల్లి బానోత్ అను కూలీ పనులతో కుమారుడిని చదివిస్తుండడం, కుమారుడి నైపుణ్యాలకు తోడుగా నిలవడం అభినందనీయం. ఈ నేపథ్యంలో, మాజీ ఎంఈఓ మరియు సామాజిక కార్యకర్త బాలగంగాధర్, చందుకి ప్రోత్సాహంగా రూ.5000 నగదును ఆర్థిక సహాయం అందించారు. అతని మిత్రుడు వెంకటేశం కూడా స్పందిస్తూ రూ.1000 లను శుక్రవారం రోజున విద్యార్థి తల్లి అనుకి వ్యక్తిగతంగా అందించారు. బాలగంగాధర్ మాట్లాడుతూ, "ఇలాంటి ప్రతిభ గల విద్యార్థులకు సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వం, పాఠశాలలు సహకరిస్తే, వారు జాతీయ స్థాయిలో మెరిసే అవకాశాలు కలుగుతాయి," అన్నారు. జాతీయ పోటీల్లో చందు విజయం సాధించి, నిజామాబాద్ జిల్లా, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని ఆశిస్తున్నామనీ అన్నారు. తన విద్యార్థి ప్రతిభను గుర్తించి ఆర్థిక సహాయం చేసిన వీరికి విద్యార్థి చందు, తల్లి అను ధన్యవాదాలు తెలుపుతూ త్వరలో జరగనున్న సాఫ్ట్ బాల్ క్రీడలో ఉత్తమంగా రాణించి జిల్లాకి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు.



## భక్తి శ్రద్ధల తో హారతి కార్యక్రమం

కాళేశ్వరం మే23 ( సమయం న్యూస్) : శుక్రవారం ఉదయం కాశీ నుండి విచ్చేసిన పండితుల ఆధ్వర్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో హారతి కార్యక్రమం నిర్వహించబడింది. సరస్వతి నవరత్న మాలా హారతి ఉత్సవాల నేపథ్యంలో ఈ ప్రత్యేక హారతి కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. ప్రారంభంగా వేదఘోషల మధ్య స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. ఆలయ ప్రాంగణం పుణ్యవాతావరణంతో మార్మోగింది. కాశీ పండితులు ఆలయ ఆచార సంప్రదాయాల మేరకు హారతి నిర్వహించి, భక్తులకు దివ్యానుభూతిని కలిగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం పూజారులకు ఘన స్వాగతం పలికారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాలా ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలి

* **విత్తనాలను అధిక ధరలకు విక్రయించరాదు**
* **ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి**
* **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగాం మే23 (సమయం న్యూస్) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, విత్తనాలకు అధిక ధరలకు విక్రయించరాదని, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. శుక్రవారం, జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలోని ఈరవెన్ను, గూడూరు గ్రామాల పరిధిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, కొనుగోళ్ల రిజిస్టర్ లను, వడ్లు తూర్పారపట్టే విధానాన్ని తనిఖీ చేశారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపుగా ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఈ రెండు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను త్వరితగతిన పూర్తిచేసి, మిల్లులకు తరలించాలని, రైతులకు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా, లారీల కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అలాగే కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడారు. కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి ఎన్ని రోజులు అయింది? తేమ శాతం ఎంత ఉంది? కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా? వడ్ల తూకం సరిగా వేస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం అదే మండల (పాలకుర్తి) కేంద్రంలో ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, అలాగే శ్రీ సుధ ఫెర్టిలైజర్స్ దుకాణాలను సందర్శించి, కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో విత్తనాల క్రయవిక్రయాల రికార్డులు, కంపెనీల పత్రాలు, విత్తన ప్యాకెట్లపై లేబుల్స్, వ్యాపార లైసెన్స్, కొనుగోళ్ల రిజిస్టర్ లను, స్టాక్ నిల్వలతో కూడిన ధరల పట్టిక బోర్డును పరిశీలించారు. రైతులు అధీకృత విత్తన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత విధిగా రైతు సంతకంతో కూడిన రసీదును ఇవ్వాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయించరాదని, అలా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే విధంగా దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసిన పలువురు రైతులకు తానే స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఎక్కడ కొన్నారు? ఎంతకు కొన్నారు? విత్తనాలకు అదనంగా నగదు ఏమైనా చెల్లించారా? ఈ విత్తన రకమే అని ఎలా తెలిసింది? గత సీజన్ లో ఏం వేశారు? రాబడి ఎంత వచ్చింది? బీటీ 3 రకం విత్తనాల అమ్మకాలు ఎక్కడైనా జరుగుతున్నాయా? అలాంటి వాటిని కొనుగోలు చేశారా? వంటి వివరాలను అడిగారు. ఈ మేరకు రైతులు స్పందిస్తూ.. ఆగ్రోస్, శ్రీ సుధ దుకాణాల్లో కొనుగోలు చేశామని, నాలుగు, ఐదు రకాల విత్తనాలు తీసుకున్నామని, మొత్తం రూ. 900, రూ. 1150కు కొనుగోలు చేశామని, పక్క రైతులు వాడారని, దిగుబడి బాగా వచ్చిందని, అందుకే ఆ రకమే కొనుగోలు చేశామని, గత సీజన్ లో కూడా రాబడి అధికంగా వచ్చిందని, అదనంగా నగదు అసలు చెల్లించలేదని, బీటీ 3 రకం విత్తనాలు ఎక్కడా కూడా లేవని రైతులు కలెక్టర్ కు వివరించారు. అందుకు గాను బీటీ 3 విత్తనాలు ఎక్కడా కూడా ఉపయోగించడానికి వీల్లేదని, అవి ఇంకా ప్రభుత్వ ఆమోదం పొందలేదని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వారి గ్రామాల్లోని రైతులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని కోరారు. తదనంతరం స్థానిక మండలంలోని బమ్మె ర గ్రామ పరిధిలో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ క్రమంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల క్షేత్రస్థాయి ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, పక్కా సమాచారం సేకరించాలని, అర్హులను పారదర్శకంగా గుర్తించాలని, వారి వివరాలను ఆన్లైన్ లో తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగేశ్వర చారి, ఎంపిడిఓ రాములు, ఆర్ఐ రాకేష్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## 70 లక్షల వ్యయంతో చేపట్టే సి సి రోడ్డు డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

* **పశ్చిమ ఎమ్మెల్యే తో కలిసి మేయర్ శంకుస్థాపన.**

వరంగల్ కార్పొరేషన్ మే 23( సమయం న్యూస్) : బల్దియా పరిధి 9, 4 వ డివిజన్ లలోని సుధానగర్, యాదవ నగర్ లోటస్ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేషన్ జనరల్ నిధులు రూ.70 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సి సి రోడ్లు డ్రైన్ నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక వరంగల్ (పశ్చిమ) శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేసిన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ..... ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చీకటి శారద ఆనంద్ బొంగు అశోక్ యాదవ్ ఈ ఈ రవి కుమార్ డి ఈ రాజ్ కుమార్ ఏ ఈ హరికుమార్ మాజీ కార్పొరేటర్లు విద్యాసాగర్ బోడ డిన్న స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కల్తీ ఎరువులు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు..

* **కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు**
* **ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలి**
* **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాద్ మే 23 ( సమయం న్యూస్) : జిల్లాలో కల్తీ ఎరువులు, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని,కలెక్టరేట్,ఎస్పీ కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు, చేయడం జరిగిందని,ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో వేగవంతం చేయాలన్నారు జిల్లా కలెక్టర్, శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని అందరూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్, తో కలిసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే, కల్తీ ఎరువులను సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు, ఎరువుల షాపులలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డిఏపి, తదితర పురుగుల మందులు ఫర్టిలైజర్స్ స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా మెయింటైన్ చేయాలని, లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు, మండల గ్రామస్థాయిలలో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీ లు నిరంతరం నిఘా, తనిఖీలు చేయడం జరుగుతుందని అన్నారు,ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కార్య స్థానం లోనే ఉండాలని, ఇలాంటి విపత్తుకర సంఘటనలు వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ముందస్తు ప్రణాళిక ప్రకారం వాగులు, చెరువులు,వంకలు,తదితర ప్రదేశాలను సందర్శించాలని, గత వరదల నేపథ్యంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఏదైనా సహాయక చర్యలు అవసరం అయితే, జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ టెలిఫోన్ నెంబర్, 7995074803 లో సంప్రదించాలని ఆయన కోరారు, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులు తాసిల్దారులు పనిచేయడం జరుగుతుందని, రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని



తరలించాలని, సూచించారు, వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని, రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు, రెండు మూడు రోజుల్లో జిల్లాలోని లక్ష్యం పూర్తిచేయాలని ఆదేశించారు, గత రాబోయే రెండు మూడు రోజుల్లో వర్షాల సూచన ఉన్నందున స్థానిక మండల అధికారులు రైతులకు మీడియా మిత్రులకు సమాచారం అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు, సూపర్డెంట్ ఆఫ్ పోలీస్, సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో కల్తీ ఎరువులు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేస్తామని అన్నారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఫోన్ నెంబర్ 8712656922 లో సంప్రదించాలని ఆయన సూచించారు, పోలీస్ యంత్రాంగం కల్తీ ఎరువులు, వాతావరణ పరిస్థితులు, ధాన్యం కొనుగోలు, అన్ని అంశాలపై సంబంధిత అధికారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు, ఈ సమావేశంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ పిడి మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిఎవో విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ మరియన్న, ఏడి ఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, అన్ని మండల కార్యాలయాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
* **మే 27 వరకు భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం**
* **కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన జాగ్రత్తలు పాటించాలి**
* **భారీ వర్షా ల నేపథ్యంలో పాటించాల్సిన అప్రమత్తత పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, మే 23 (సమయం న్యూస్) : రానున్న 3 నుంచి 4 రోజులపాటు పెద్దపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మన పెద్దపల్లి జిల్లాలో మే 27 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ధాన్యం కొనుగోలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. రైతులు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, విక్రయించని ధాన్యం భద్రపర్చుకోవాలని, వాతావరణంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఉండాలని, వర్షాలు కురిసే నేపథ్యంలో ధాన్యం తడువకుండా టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు.

## తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమి ద్వారా డ్రాయింగ్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



బోధన్ పట్టణం, మే 23, సమయం న్యూస్ : తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ డ్రాయింగ్ శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తయింది. శుక్రవారం రోజున బోధన్ పట్టణంలోని పిఆర్టియు భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఖైరాన్, ఎంబెల్లి శంకర్, గంగాధర్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి తనలోని కళా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలను తప్పక ఉపయోగించుకోవాలి," అని సూచించారు. చిత్రకళ మనసులోని భావాలను వెలికితీయగల శక్తివంతమైన సాధనం అని వారు పేర్కొన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవడంతోపాటు, భవిష్యత్తులో గొప్ప చిత్రకారులుగా ఎదగే అవకాశాలు పొందుతారని తెలిపారు.

# బోధన్ శ్రీమారుతీ మందిరంలో షట్టర్ల బహిరంగ వేలం

– **విజయవంతంగా ముగిసిన వేలంపాట**

బోధన్ పట్టణం, మే 23, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శ్రీ మారుతీ దేవాలయం పరిధిలో ఉన్న నెంబర్ 5, 6 షెట్లను రెండు సంవత్సరాల అద్దెకు ఇవ్వడానికి శుక్రవారం దేవాలయం ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ బహిరంగ వేలం పాట దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశానుసారం జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షకులు కమల, కార్యనిర్వహణ అధికారి రాములు, ఆలయ చైర్మన్ గుండేటి శంకర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటకు నలుగురు వ్యక్తులు దరఖాస్తు చేసుకోగా రెండు సంవత్సరాలకు గాను రెండు లక్షల డిపాజిట్ తో నెంబర్ 5 షటర్ ను నెలకు రూ.7,100 అద్దెకు కాళిదాస్ చారి, నెంబర్ 6 షటర్ను



నెలకు రూ.7,200 కి హనుమండ్లు చారి హెచ్చు పాట దారులుగా వేలంలో దక్కించుకున్నారు. దేవాలయ ఆర్థిక వనరుల అభివృద్ధికి ఈ చర్య దోహదపడనుంది. ఈ కార్యక్రమం పారదర్శకంగా, ప్రజల సమక్షంలో నిర్వహించడంతో ప్రజల మద్దతు లభించింది. ఇలాంటి బహిరంగ వేలాలు దేవాలయాల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సభ్యులతోపాటు ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్, వీడిసి చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, శివాలయం చైర్మన్ హరికాంత్ చారి, వీడిసి కోశాధికారి గమరపేట శ్రీనివాస్, ఆలయ సభ్యులు సుధాకర్, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.







# పాత కానే కాదు... బెయిజ్!




'ఇదొక రంగా? బ్లీచింగ్‌కీ, డై చేయించడానికీ డబ్బుల్లేనివారు వేసుకుంటారు. పేదరికానికి గుర్తు' ఒకప్పుడు బెయిజ్ గురించి ఇలాగే మాట్లాడేవారట. ముతక వస్త్రం వర్ణాన్నే పోలి ఉంటుందీ రంగు. అందుకే వేసుకోవడానికీ ఇష్టపడేవారు కాదు. కానీ ఇప్పుడు... దీన్నే సంపదకీ, శ్రేయస్సుకీ ముఖ్యంగా స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. ఎంత తేడానో కదా! కాస్త గోధుమ రంగు... లేదు లేదూ ఇసుకను పోలి ఉంటుంది... అబ్బే బంగారు వర్ణంలా ఉంటుందండీ... ఒక్కొక్కరూ దీన్ని ఒక్కోలా వర్ణిస్తారు. నిజమే తెలుపు, పసుపు మధ్యలో చాలా షేడ్‌లలో ఉంటుందిది. అయితే స్వచ్ఛతకు గుర్తుగా మనసుకు ప్రశాంతతని ఇచ్చే రంగుగా తెలుపును చెబుతారు. కానీ... బెయిజ్ ఇచ్చే మెసేజ్ అంతకు మించి. అమ్మ ఒడి, ఆత్మీయుల ఆలింగనంలో ఉండే వెచ్చదనం దీని సొంతం అంటారు ఫ్యాషనిస్టులు. అందుకే దీనికి ఫ్యాషన్ ప్రపంచంలోనే కాదు, ఇంటీరియర్ రంగంలోనూ ఆదరణ ఎక్కువే. పైగా ఏ రంగులతోనైనా ఇట్టే మిళితమవుతుంది. ఏది వేసుకోవాలి, నాకు నప్పతుందా అన్న ఒత్తిడి అస్సలే ఇవ్వదు. కోట్, షర్ట్, కుర్తీ, లెహెంగా, చీర... ఏ రూపంలో వేసుకున్నా ఇది ఇచ్చే వైబే వేరు. పైగా టైమ్‌లెస్ కలర్‌గా పేరు. అందుకే డిజైనర్లు ఎక్కువ ఎంచుకునేదీ బెయిజ్‌నే. గమనించారో లేదో ఈసారి నవ వధువుల దగ్గర్నుంచి హీరోయిన్ల వరకూ మనసు పారేసుకుంటున్నదీ ఈ రంగుపైనే. కాబట్టే, ఈ ఏడాది రంగు మోకా మూస్‌ను వెనక్కి నెట్టిమరీ బెయిజ్ ట్రెండ్ అవుతోంది. ముదురు రంగులేవైనా వచ్చి పోతుంటాయి. బెయిజ్ ఎప్పుడూ క్లాసిక్కే అన్న పొగడ్తలూ అందుకుంటోంది. మనసుకు విశ్రాంతి, సురక్షిత భావన కలిగించడం... పైగా ఎల్లప్పుడూ ఇచ్చే ట్రెండీ లుక్ దీని సొంతం. అందరూ మనసు పారేసుకుంటున్నదీ అందుకే. మరి మీ దగ్గరుందా బెయిజ్? ఏ డ్రెస్ రూపంలో?










# మామిడి పండ్లు తినేముందు!

**మామిడి పండ్లను చూస్తే క్షణమైనా ఆగలేం.. వాటి రుచిని ఆస్వాదించే దాకా మనసు మనసులో ఉండదు. అయితే ఆ ఆత్రుతే వద్దంటున్నారు నిపుణులు. ఈ పండ్లను తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం మంచిదంటున్నారు.**



*** ఎంతసేపు నానబెట్టాలి?**

'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి6' విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనే కాదు.. ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చేకూరాలంటే తినే ముందు వాటిని 12 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట పాటైనా నీటిలో నానబెట్టాలట!



**వేడి చేయకుండా..**

వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొంతమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు. దీనివల్ల కొంతమంది శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. అయితే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెడితే.. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోతాయంటున్నారు నిపుణులు.

*** రసాయనాలు తొలగాలంటే..**

మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిన రసాయనాల ప్రభావం పండు తొక్క పైన ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికి ప్రమాదం! తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు నిపుణులు.

# ఇంగ్లండ్ టూర్‌కు ఆ స్టార్ పేసర్ దూరం..?



ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు టీమ్‌ఇండియా జట్టును శనివారం ప్రకటించనున్నారు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. ఎవరికి సారథ్య బాధ్యతలు అప్పగిస్తారన్న విషయం ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ సిరీస్‌కు స్టార్ పేసర్ మహమ్మద్ షమీ దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తుండటం టీమ్‌ఇండియా అభిమానులను కలవరానికి గురిచేస్తోంది. షమీ టెస్టుల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయలేడని బీసీసీఐ వైద్యబృందం యాజమాన్యానికి చెప్పినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. అతడిని జట్టులోకి తీసుకుంటే.. ఐదు టెస్టులూ ఆడే అవకాశాలు చాలా తక్కువని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌కు మరో 20 రోజులే సమయం ఉన్న నేపథ్యంలో ఈ వార్త టీమ్‌ఇండియాను ఇబ్బందికి గురిచేసేదే. మరోవైపు టెస్టు కెప్టెన్సీ రేసులో ఉన్న బుమ్రా కూడా.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ వల్ల అన్ని టెస్టులు ఆడే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో టీమ్‌ఇండియా జట్టును ఎంపిక చేయనున్న సెలక్షన్ కమిటీ ఈ విషయంలో సందిగ్ధంలో పడినట్లు సమాచారం. భారత జట్టు ప్రణాళికలపై కూడా ఇది ప్రభావం చూపించే అవకాశం ఉంది. "షమీ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున నాలుగు ఓవర్లు వేశాడు. అయితే.. అతడు ఒక రోజులో పది ఓవర్ల కంటే ఎక్కువ ఓవర్లు వేస్తాడా.. అన్న విషయం బోర్డుకు, సెలెక్టర్లకు తెలియదు. ఇంగ్లండ్‌లో టెస్టుల్లో పేసర్లు ఎక్కువ స్పెల్స్ వేసే అవసరం ఉండొచ్చు. మేం ఎలాంటి ఛాన్స్‌లు తీసుకోలేం" అని ఓ బీసీసీఐ అధికారి ఆంగ్ల మీడియాకు తెలిపినట్లు సమాచారం. ఒకవేళ షమీని పక్కనపెడితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు లేదా హరియాణా పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం లభించవచ్చు. ఇక షమీ 2023 WTC Finalలో ఓవల్‌లో ఆస్ట్రేలియాపై చివరిసారిగా టెస్టు ఆడాడు. ఇక టెస్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా పోటీలో ఉన్నారు. సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కడం ఖాయం. కోహ్లి, రోహిత్‌ల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత జట్టు ఎంపిక జరగనుంది.

### వివాదంలో పంజాబ్ జట్టు..

# కోర్టుకెక్కిన ప్రీతి జింటా..!

పంజాబ్ కింగ్స్ జట్టులో వివాదం చెలరేగింది. ఆ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా కోర్టుకెక్కింది. జట్టు సహ డైరెక్టర్లు అయిన మోహిత్ బుర్మాన్, నెస్ వాడియాపై చండీగఢ్ కోర్టులో కేసు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీరు సమావేశం నిర్వహించారంటూ పిటిషన్ వేసింది. వీరు ముగ్గురు కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉన్నారు. ఐపీఎల్ లోని పంజాబ్ కింగ్స్ జట్టు ఈ కంపెనీదే. గత నెల 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశంచట్టబద్ధతను ప్రీతి జింటా కోర్టులో సవాలు చేసింది. కంపెనీ చట్టం 2013 ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ఈ సమావేశాన్ని నిర్వహించారని తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ భేటీకి సంబంధించి అభ్యంతరాలను తాను ఏప్రిల్ 10నే ఈమెయిల్ రూపంలో తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని ఆమె పేర్కొంది. నెస్ వాడియా మద్దతుతో మోహిత్ బర్మాన్ ఈ సమావేశాన్ని నిర్వహించారని ఆరోపించింది. తాను, మరో డైరెక్టర్ కరణ్ పాల్ ఈ సమావేశానికి హాజరైనప్పటికీ.. ఈ సమావేశం చట్టబద్ధత చెల్లదని ప్రకటించాలని ప్రీతి జింటా కోర్టును కోరింది. ఈ సమావేశంలో మునీశ్ ఖన్నాను డైరెక్టర్‌గా నియమించడాన్ని ప్రీతి జింటా, పాల్ వ్యతిరేకించారు. డైరెక్టర్‌గా ఖన్నా నియామకాన్ని నిలిపివేయాలని ఆమె తన పిటిషన్‌లో కోర్టును కోరింది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కంపెనీ అమలుచేయకుండా చూడాలని అభ్యర్థించింది. ఈ కేసు పరిష్కారం అయ్యేవరకూ.. తాను, కరణ్‌పాల్ లేకుండా బోర్డు సమావేశాలు నిర్వహించకుండా చూడాలని ప్రీతి జింటా కోర్టును కోరారు.




# దీపిక ప్లేస్‌లో రుక్మిణి



సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న స్పిరిట్ సినిమాలో హీరోయిన్ గా దీపికా పదుకొణెను తప్పించారు. ఆమె ప్లేస్ లో కన్నడ నటీమణి రుక్మిణి వసంత్‌ను తీసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ వార్త సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'కల్కి 2898 ఏడీ' సినిమాతో ప్రభాస్‌తో కలిసి నటించి, తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన దీపికా పదుకొణె, 'స్పిరిట్' సినిమాలోనూ హీరోయిన్‌గా నటించనుందని అందరూ భావించారు. అయితే, ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడానికి పలు కారణాలు చెబుతున్నారు. మీడియా రిపోర్ట్స్ ప్రకారం, దీపికా 8 గంటల వర్కింగ్ షిఫ్ట్, రూ. 20 కోట్ల రెమ్యునరేషన్, సినిమా లాభాల్లో వాటా, తెలుగు డైలాగ్స్ చెప్పడానికి నిరాకరణ వంటి షరతులు వివాదాస్పదమయ్యాయి. దీంతో ఆమెను తప్పించినట్టు తెలుస్తోంది.దీంతో ఆమె స్థానంలో రుక్మిణి వసంత్‌ను తీసుకునేందుకు మూవీ టీం చర్చలు జరుపుతోందని టాక్. 2019లో 'బీర్బల్ ట్రిలాజీ' సినిమాతో తన సినీ ప్రస్థానం ప్రారంభించిన ఆమె, 2023లో 'సప్త సాగరదాచే ఎల్లో' సినిమాలతో ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ప్రియ పాత్రలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డ్ కూడా దక్కింది.



# ఓటీటీలో సారంగపాణి జాతకం

కమెడియన్ గా నటించి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి. ఆ తర్వాత హీరోగా ఎదిగాడు. సినిమాలు మాత్రమే కాదు సేవ్ ది టైగర్స్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటించి మంచి టాక్ ని సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది ప్రియదర్శి పంట పండింది. నాని నిర్మించిన కోర్టు మూవీలో నటించాడు. ఆ మూవీ భారీ విజయం అందుకోవడంతో ఆ తర్వాత సారంగపాణి జాతకం సినిమాతో ప్రేక్షకులు ముందుకు వచ్చాడు. ప్రియదర్శి హీరోగా, రూపా కొడవాయూర్ హీరోయిన్ గా నటించిన మూవీ సారంగపాణి జాతకం. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ , శ్రీదేవి మూవీస్ శివలెంక కృష్ణ ప్రసాద్ కాంబినేషన్‌లో 'జెంటిల్ మన్, సమ్మోహనం' వంటి సక్సెస్ ఫుల్ చిత్రాల తర్వాత ముచ్చటగా మూడవ చిత్రంగా ఈ మూవీ వచ్చింది. మొదటినుంచి భారీ అంచనాలనే క్రియేట్ చేసుకున్న ఈ మూవీ థియేటర్లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. కానీ కామెడీ కారణంగా సినిమాకు మంచి కలెక్షన్స్ వచ్చాయి. ఇక ఈ మూవీ ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కు వచ్చేసింది.

# నికితా దత్తాకు కరోనా

కరోనా ఒమిక్రాన్ కొత్త వేరింట్ ఇండియాలోకి వచ్చేసింది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు కరోనా బారిన పడుతున్నారు. మొన్నటికి మొన్న శిల్పా శిరోద్కర్ కు కొవిడ్ పాజిటివ్‌గా తేలిన విషయం తెలిసిందే. తాజాగా మరో బాలీవుడ్ నటి కరోనా బారిన పడ్డారు. హీరోయిన్ నికితా దత్తాకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అ విషయాన్ని నటి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తనతోపాటు తన తల్లికి కూడా కొవిడ్ సోకినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉంటూ చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారు. అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. నాలుగు రోజుల క్రితం శిల్పా శిరోద్కర్ కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కొవిడ్ పాజిటివ్ వచ్చిందని.. అందరూ జాగ్రత్తగా ఉండాలని.. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో సూచించారు.



### ఊహకు మించిన ఆదరణ..

# 'అనగనగా' ఓటీటీ నుంచి థియేటర్లలోకి : సుమంత్

థియేటర్లలో విడుదలైన తర్వాత సినిమాలు ఓటీటీలోకి రావడం, మరోవైపు నేరుగా ఓటీటీలోనే రిలీజ్ కావడం సాధారణం. కానీ, ముందుగా ఓటీటీలో రిలీజై, ఆ తర్వాత థియేటర్లలో విడుదల కావడం అరుదు. ఈ రెండో జాబితాలోదే 'అనగనగా' (Anaganaga). సుమంత్ (Sumanth), కాజల్ చౌదరి, మాస్టర్ విహర్ష్ ప్రధాన పాత్రల్లో సన్నీ సంజయ్ తెరకెక్కించిన ఈ సినిమా ఇది. ప్రముఖ ఓటీటీ 'ఈటీవీ విన్' (ETV Win)లో కొన్ని రోజుల క్రితం విడుదలైన ఈ సినిమాకి మంచి స్పందన దక్కింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ చిత్రం థియేటర్లలోకి రానుందని సుమంత్ తెలిపారు. నటుడు అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.

* **'ఈటీవీ విన్'తో నా జర్నీ కొనసాగుతూనే ఉంటుంది: సుమంత్**

"ఇలాంటి సినిమాలకు రచన చాలా ముఖ్యం. 'అనగనగా' కథను సన్నీ, దీప్తి అద్భుతంగా రాశారు. నేను గతంలో నటించిన 'మళ్లీరావా' తర్వాత నన్ను అంతగా ఆకట్టుకున్న కథ ఇదే. 'ఈటీవీ విన్'తో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. ఈ స్క్రిప్టుపై మాకు ముందు నుంచీ నమ్మకం ఉంది. సినిమా చూసిన అడివి శేష్ భావోద్వేగానికి గురయ్యాడు. 'ఈ చిత్రంలో విషయం ఉంది' అని అప్పుడు అనుకున్నా. మేం ఊహించిన దాని కంటే ఎక్కువగా ప్రేక్షక ఆదరణ దక్కడం ఆనందంగా ఉంది. నేరుగా ఓటీటీ 'ఈటీవీ విన్'లో విడుదలైన ఈ సినిమాని ఆడియన్స్ డిమాండ్ మేరకు పలు థియేటర్లలో రిలీజ్ చేయనున్నాం. ముందుగా విజయవాడ(ఈ నెల 24న), విశాఖపట్నం (ఈ నెల 25న)లో ప్రదర్శించనున్నాం. త్వరలో మరిన్ని స్క్రీన్స్‌లో ప్రదర్శిస్తాం" అని సుమంత్ తెలిపారు.

**ఇది ఏడిపించే సినిమా కాదు: అడివి శేష్**

"నా తొలి సినిమా ఈవెంట్‌కు సుమంత్ ముఖ్య అతిథిగా వచ్చారు. అప్పటి నుంచే ఆయన కుటుంబ సభ్యుడిలాంటి వారు. 'అనగనగా'లో సుమంత్ పోషించిన వ్యాస్ పాత్రకు, ఆయన జీవితానికి కొన్ని పోలికలున్నాయి.



"

**గ్లామరస్ లుక్ లో అంజలి అంజలి తన శక్తివంతమైన నటనతో, ముఖ్యంగా సాంప్రదాయ పాత్రలలో ప్రేక్షకులను నిరంతరం ఆకట్టుకుంది.**

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.